క్లుప్తంగా...

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. యాసిన్ జంగ్ మసీదు ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 6 నుంచి 9 గంటల వరకు, మాతాకి కిడికి, ధర్మవంత్ కాలేజీ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

బాధ్యతల స్వీకరణ


మల్లేష్

సంతోష్‌నగర్: ఐ.ఎస్.సదన్ నూతన పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా ఎస్.మల్లేష్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. 2007 బ్యాచ్‌కు చెందిన మల్లేష్ పలు పోలీస్‌స్టేషన్లలో పని చేశారు. చార్మినార్ పోలీస్‌స్టేషన్‌లో డీఐగా పని చేస్తున్న మల్లేష్‌ను నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఐ.ఎస్.సదన్ పోలీస్‌స్టేషన్‌కు ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో మల్లేష్ సోమవారం స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తనవంతు కృషి చేస్తానన్నారు.

ప్రత్యేక పూజలు


పూజల్లో పాల్గొన్న డీసీపీ సాయి చైతన్యను సన్మానిస్తున్న నిర్వాహకులు

చార్మినార్: దూద్‌బౌలిలోని కాల భైరవ హనుమాన్ ఆలయంలో సోమవారం నిర్వహించిన నవగ్రహ పూజా కార్యక్రమంలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు డీసీపీ సాయి చైతన్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంకజ్ నావేందర్, పవన్, నరేష్, కునాల్ రావు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మొఘల్‌పురా డీఐగా అక్రం బాబా


బాధ్యతలు స్వీకరిస్తున్న అక్రం బాబా

గౌలిపురా: మొఘల్‌పురా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా మహమ్మద్ అక్రం బాబా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేస్తున్న డీఐ గురునాథం గోషామహల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ కాగా ఆయన స్థానంలో హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న మహమ్మద్ అక్రం బాబాను మొఘల్‌పురా పోలీస్‌స్టేషన్ డీఐగా బదిలీ చేస్తూ నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఉత్తర్వులు జారీ చేయడంతో సోమవారం డీఐ గురునాథం నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకుంటానన్నారు.

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలి

గోల్కొండ: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంటమాలజీ విభాగం ఏఈ మహ్మద్ ఖయ్యూం అన్నారు. సోమవారం ఆయన షేక్‌పేట్‌లో పర్యావరణ హిత జీవనశైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షేక్‌పేట్ వినాయక కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. నేడు పర్యావరణ పరిరక్షణ అత్యంత ప్రధానమైందన్నారు. పర్యావరణ పరిరక్షణలో బస్తీ సంక్షేమ సంఘాలు, యువజన సంఘాలు పాల్గొనాలని ఆయన సూచించారు. బల్దియా వారు ఏర్పాటు చేస్తున్న చెత్త డబ్బాల్లోనే చెత్తను వేయాలని, తడి, పొడి చెత్తను విభజించి వాటికి కేటాయించిన డబ్బాల్లోనే వాటిని వేయాలని ఆయన అన్నారు. అదే విధంగా నీరు ఎంతో అమూల్యమైందని, ప్రతి చుక్కను ఒడిసి పట్టుకునేందుకు ఇంకుడు గుంతను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ నాయకుడు చింతకుంట్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలి

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్


బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన బల్దియా కమిషనర్ సోమేశ్ కుమార్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన కార్వాన్ నియోజకవర్గానికి బల్దియా నుంచి ఇప్పటి వరకు మంజూరైన నిధులు, అందులో పూర్తయిన పనులు తదితర విషయాలపై చర్చించారు. కార్వాన్ నియోజకవర్గంలో రోడ్డు విస్తరణ పనులు సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్నాయని, ఆ ఫైళ్లను వెంటనే పరిశీలించి వాటిని పరిష్కరించాలని ఆయన కోరారు. మరోవైపు బల్దియా ఇంజినీరింగ్ విభాగం అధికారులు ఇదిగో అదిగో అంటూ పనుల్లో జాప్యం చేస్తున్నారని, దీనివల్ల తాను ప్రజలకు జవాబు చెప్పుకోలేకపోతున్నానన్నారు. వ్యక్తిగతంగా తనకే కాకుండా మజ్లిస్ పార్టీకి కూడా చెడ్డపేరు వస్తుందన్నారు. రోడ్ల కోసం మంజూరైన రూ.20 కోట్లకు వెంటనే టెండర్ పిలిచి పనులు ప్రారంభించాలని ఆయన కోరారు. అంతేకాకుండా కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న పనుల విషయంపై ప్రతినెలా వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి అధికారులకు అవసరమైన దిశానిర్దేశనం చేయాలని ఆయన బల్దియా కమిషనర్‌ను కోరారు. రానున్నది వర్షాకాలమని, వర్షాలకు రోడ్లు మళ్లీ దెబ్బతినే ప్రమాదం ఉందని, ఈ కారణంగా రోడ్లకు అవసరమైన ప్యాచ్‌వర్కు పనులను చేయాలని ఆయన కోరారు. వీధిలైట్ల నిర్వహణ అధ్వానంగా తయారయ్యిందని, సంబంధిత అధికారులకు సరైన ఆదేశాలు ఇచ్చి హైమాస్ట్ లైట్లు, మినీ హైమాస్ట్‌లు, మోడ్రన్ వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి


సీసీఎల్‌ఏ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న వీఆర్‌ఓ కుటుంబ వారసులు

గన్‌ఫౌండ్రీ: వీఆర్‌ఓ కారుణ్య నియామకాలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం సరికాదని పలువురు బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా ముందు వరకు కారుణ్య నియామకాల భర్తీ జరిగిందని, ఆ తర్వాత వీఆర్‌ఓ వ్యవస్థ రద్దు కావడంతో కారుణ్య నియామకాలను కూడా నిలిపివేశారని కన్నీటి పర్యంతమయ్యారు. మృతిచెందిన వీఆర్‌ఓ కుటుంబసభ్యుల కారుణ్య నియామకాలను తక్షణమే నిర్వహించాలని కోరుతూ సోమవారం నాంపల్లిలోని భూ పరిపాలన ప్రధాన కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు మాట్లాడుతూ.. సర్వీస్ నిబంధనల ప్రకారం విధుల్లో మరణించిన ఉద్యోగి వారసులకు అర్హతలను బట్టి కారుణ్య నియామకాలను భర్తీ చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ దానిని అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. గత మూడేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో సీఎం కేసీఆర్ జోక్యం చేసుకుని తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ జిల్లాలకు చెందిన బాధిత వీఆర్‌ఓ కుటుంబాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేతు విశ్వనాథరెడ్డి మరణం ప్రగతిశీల సాహిత్యానికి తీరని లోటు

నాంపల్లి: సుప్రసిద్ధ కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అభ్యుదయ రచయితల సంఘం నాయకులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి మరణం పట్ల తెలుగు వర్సిటీ పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ ఓ ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. తామిద్దరం అభ్యుదయ సాహిత్యోద్యమంలోనూ, విశాలాంధ్ర విజ్ఞాన సమితిలోనూ కలిసి పనిచేసినట్లు గుర్తు చేసుకున్నారు. 20 ఏళ్ల క్రితం హైదరాబాద్‌లో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల మహాసభల నిర్వహణలో ఆయన పాత్ర విశిష్టమైనదని తెలిపారు. ఉత్తమ కథా రచయితగా, సాహిత్య ఉద్యమ నాయకుడిగా, పరిపాలనాదక్షుడిగా బహుముఖీనమైన కృషిని కొనసాగించిన కేతు విశ్వనాథరెడ్డి మరణం ప్రగతిశీల సాహిత్యానికి తీరని నష్టమని తెలిపారు. ఈ సందర్భంగా వారి కుటుంబసభ్యులకు, కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య ప్రేమికులకు ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు.

శ్రీశైలంలో ఎరుకల భవన్ నిర్మించాలి


ఎమ్మెల్సీ రవిబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎరుకల సంఘం నాయకులు

గోల్కొండ: శ్రీశైలంలో అన్ని కులాలకు సత్రాలు ఉన్నాయని, ఒక్క ఎరుకల కులానికి మాత్రమే సత్రం లేదని ఎరుకల సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కెంబసారం కృష్ణ, కురకుల కృష్ణ అన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం తరఫున ఆంధ్రప్రదేశ్ ఎమ్మెల్సీ ఎరుకల సోదరుడైన కుంభ రవిబాబుకు వినతిపత్రం సమర్పించారు. శ్రీశైలం తదితర ప్రాంతాలతో పాటు తెలంగాణ జిల్లాల నుంచి ప్రతినిత్యం ఎరుకల సోదరులు శ్రీశైలానికి వస్తారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. అంతేకాకుండా వీరు కుటుంబాలతో వచ్చిన వారు వసతి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. ఎలాగైనా ఈ విషయంపై తెలుగు రాష్ట్రాల మంత్రులతో మాట్లాడి శ్రీశైలంలో ఎరుకల సత్రం ఏర్పాటుకు కృషి చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు. కాగా ఈ విషయంపై వెంటనే అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్సీ కుంభ రవిబాబు హామీ ఇచ్చారు. కలిసిన వారిలో ఎరుకల సంఘం నాయకులు చంద్రయ్య, శంకర్, నర్సింహ, పాండు, కె. విజయ్‌కుమార్, బి. సత్యనారాయణ, శ్రీనివాస్, జైస్వాల్ తదితరులున్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు


విశాల్‌యాదవ్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న నందకిశోర్ వ్యాస్ బిలాల్

అబిడ్స్: బీఆర్‌ఎస్ పార్టీలో కష్టించి పనిచేసే వారికి సముచిత స్థానం ఉంటుందని గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్ పేర్కొన్నారు. విశాల్‌యాదవ్‌ను గోషామహల్ నియోజకవర్గ యూత్ వింగ్ కార్యదర్శిగా నియమించి ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. అనంతరం నందకిశోర్ వ్యాస్ బిలాల్ మాట్లాడుతూ.. కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలన్నారు. కార్యకర్తలకు 24 గంటల పాటు పార్టీ అండగా ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ పథకాలు నియోజకవర్గంలో నలుమూలలా అన్ని వర్గాల ప్రజలకు అందించేందుకు ప్రత్యేక కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం విశాల్‌యాదవ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన నందకిశోర్ వ్యాస్ బిలాల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూజవ్యాస్ బిలాల్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తిపని వారికి ఆలయ కమిటీలో సభ్యత్వం కల్పించాలి


దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గోల్కొండ: గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి బోనాల నిర్వహణ కమిటీలో తమకు సభ్యత్వం కల్పించాలని అమ్మవారి వృత్తిపని సంఘం అధ్యక్షుడు బొమ్మల సాయిబాబాచారి అన్నారు. ఈ మేరకు ఆయన సోమవారం వృత్తిపని సంఘం వారితో కలిసి రాష్ట్ర దేవాదాయా, ధర్మాదాయ ఇన్‌స్పెక్టర్ సురేందర్‌కు వినతిపత్రం సమర్పించారు. తరతరాలుగా తాము అమ్మవారికి సేవ చేస్తూ వస్తున్నామని ఆ వినతి పత్రంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత బోనాలు రాష్ట్ర పండుగగా గుర్తించబడ్డాయని, దీనివల్ల బోనాలను భారీ ఎత్తున నిర్వహించడం జరుగుతుందన్నారు. బోనాల ఏర్పాట్లు, అమ్మవారి సేవలలో వివిధ రకాల కులస్తులు బోనాలను విజయవంతం చేయడానికి ఆలయ కార్యనిర్వహణాధికారి ఆదేశాలకు అనుగుణంగా పని చేస్తున్నారన్నారు. అంతేకాకుండా మొట్టమొదటి సారిగా తెలంగాణ ప్రభుత్వం తమ సేవలను గుర్తించి యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వడమే కాకుండా తమ సేవలకు గాను గౌరవం భత్యం కూడా ఇవ్వడం జరుగుతుందన్నారు. బోనాల నిర్వహణ కమిటీలో తమలో ఒకరిని కమిటీ చైర్మన్, సభ్యుడిగా నియమించాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో శ్రీకాంత్ చారి, రామకృష్ణ, నర్సింహులు తదితరులున్నారు.

31న సూపర్‌స్టార్ కృష్ణ జయంతి

గన్‌ఫౌండ్రీ: వాసవి గ్రూప్ సౌజన్యంతో కళాదర్బార్ సంస్థ ఆధ్వర్యంలో సినీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ 80వ జయంతి వేడుకలను ఈనెల 31న రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు పాత్తూరి రంగారావు తెలిపారు. ఈ మేరకు సోమవారం జయంతి వేడుకల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రముఖ సినీ నటులు బ్రహ్మానందం, చంద్రమోహన్, మురళీమోహన్, సినీ నటి జయప్రదలతో పాటు పలువురికి అవార్డులను అందజేయనున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమాని హీరో సుధీర్‌బాబు, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. సినీ నేపథ్య గాయని గాయకులతో సంగీత విభావరి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాయకులు హేమమాలిని, త్రినాథరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి ప్రారంభించాలి


మాట్లాడుతున్న బోనాల శ్రీనివాస్

అఫ్జల్‌గంజ్: నూతనంగా నిర్మించిన పార్లమెంట్ భవనాన్ని రాష్ట్రపతి చేత ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గౌలిగూడలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనాన్ని ఈ నెల 28న ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని, రాష్ట్రపతిచే ప్రారంభించాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ డిమాండ్‌కు మా మద్దతు ఉంటుందన్నారు. మహిళా రాష్ట్రపతిచే పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించటల్లైతే మరింత ఉన్నతంగా ఉంటుందని, దేశ ప్రతిష్ట పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

జైస్వాల్ సేవా సమితికి స్థలాన్ని కేటాయించాలి

సుల్తాన్‌బజార్: జైస్వాల్ సేవా కులస్థులకు స్థలాన్ని కేటాయించాలని బీజేపీ జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ కోరారు. జైస్వాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో సమితి ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జైస్వాల్ సేవా సమితి సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. పేదలకు పెండ్లిలు, ఇతర శుభకార్యాలకు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని మంత్రి తలసానిని కోరినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు నితిన్ జైస్వాల్, సంజయ్ జైస్వాల్, అశోక్ జైస్వాల్, శరద్ తదితరులు పాల్గొన్నారు.


మంత్రి తలసానికి వినతిపత్రం అందజేస్తున్న జైస్వాల్ సేవా సమితి ప్రతినిధులు

కార్పొరేటర్ పర్యటన

గోల్కొండ: షేక్‌పేట్ డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని బల్దియా స్టాండింగ్ కమిటీ సభ్యుడు కార్పొరేటర్ మహ్మద్ రాషెద్ ఫరాజుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన అజీజ్‌బాగ్, అరవింద్ నగర్ కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ తిరిగి స్థానికులను కలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు తమ కాలనీ సమస్యలను ఆయనకు విన్నవించుకున్నారు. రోడ్డు అధ్వానంగా తయారయ్యాయని, రోడ్లకు ప్యాచ్ వర్కులు వెంటనే చేయించాలని కోరారు. కాగా డివిజన్ పరిధిలో రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులు జరుగుతున్నాయని, వర్షాకాలం ప్రారంభమయ్యే ముందు ఈ పనులు అన్ని ప్రాంతాల్లో పూర్తవుతాయని ఆయన అన్నారు. అంతేకాకుండా కాలనీలలో ఇప్పటి వరకు వీడీసీసీ రోడ్డు వేయడం జరిగిందని, ఆ ప్రాంతాల్లో మినీ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయనున్నామన్నారు. సమస్యలు నేరుగా తనకు తెలిపితే పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

‘మంచి కవిత్వం హృదయాన్ని కదిలిస్తుంది’


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శ్రీదేవి తదితరులు

గన్‌ఫౌండ్రీ: మంచి కవిత్వం హృదయ స్పందనలను కదిలిస్తుందని తెలంగాణ రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్‌పర్సన్ మంత్రి శ్రీదేవి అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కుమర్‌రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి గడ్డం శ్యామల రచించిన తూర్పు సింధూరం పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలోని అనేక అంశాలను కవిత్వం రూపంలో రాయడం అభినందనీయమన్నారు. అనంతరం నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రంథ అనువాదకులు ఎం.దామోదరాచారి, రచయిత్రి స్వాతి శ్రీపాద, ఫౌండేషన్ అధ్యక్షుడు కేవీ.జ్ఞానకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన థియేటర్ టెక్నికల్ వర్క్ షాప్


టెక్నికల్ వర్క్‌షాప్ ముగింపు సభ

నాంపల్లి: డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో పది రోజుల జాతీయ స్థాయి థియేటర్ టెక్నికల్ వర్క్‌షాపు ముగిసింది. ఈ మేరకు సోమవారం తెలుగు వర్సిటీలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా బరోడా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ దర్శన్ సతీష్ చంద్ర పురోహిత్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డీఎస్ఎస్ మూర్తి, తెలుగు వర్సిటీ లలిత కళాపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు, యూనివర్సిటీ ఆఫ్ పాండిచ్చేరి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.వి.భూషణ్, తెలుగు వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, వర్క్‌షాపు కో ఆర్డినేటర్ డాక్టర్ రాజు ఆంథోని, రంగస్థల కళల శాఖ అధ్యాపకురాలు డాక్టర్ బీహెచ్.పద్మప్రియ, మల్లాది గోపాలకృష్ణ, బీహెచ్.కల్యాణి పాల్గొన్నారు.

భాగ్యరెడ్డి వర్మ సేవలు ఎనలేనివి


మురళీధర్‌రావుకు జీవిత సాఫల్య పురస్కారం అందజేస్తున్న జూలూరి గౌరీశంకర్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: ఆనాటి సమాజంలో సాంఘిక దురాచారాలను రూపుమాపేందుకు భాగ్యరెడ్డి వర్మ చేసిన కృషి ఎనలేనిదని పలువురు ప్రముఖులు అన్నారు. సోమవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, ఎస్సీ సంక్షేమ శాఖ, ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ ఆధ్వర్యంలో భాగ్యరెడ్డి వర్మ 135వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయిచంద్‌లు మాట్లాడుతూ భాగ్యరెడ్డి వర్మ బాలికల విద్య, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేశారని కొనియాడారు. అనంతరం అఖిల భారత ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ సొసైటీ అధ్యక్షులు జి.మురళీధర్ రావుకు భాగ్యరెడ్డి వర్మ జీవిత సాఫల్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ కళాకారులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

నాలా పూడికతీత పనుల పరిశీలన


పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్

యాకుత్‌పురా: రానున్న వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా నాలాలు, డ్రైనేజీ పూడికతీత పనులను చేపట్టి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్ తెలిపారు. యాకుత్‌పురా రైల్వేస్టేషన్, యశ్రఫ్‌నగర్, మదీనానగర్, ధోబీఘాట్ నాలా పూడికతీత పనులను సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది వర్షాలకు జలయమైన లోతట్టు ప్రాంతాల్లో నాలాలు, డ్రైనేజీ పూడికతీత పనులను చేపట్టి వర్షాపు నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే అధికారులతో పలు ప్రాంతాల్లో పర్యటించి బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరామన్నారు. ఆయనతో పాటు మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, జీహెచ్‌ఎంసీ, ఇంజినీరింగ్, ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..


డ్యాన్స్‌తో అదరగొడుతున్న విద్యార్థులు

గోల్కొండ: వేసవి శిబిరాలను చిన్నారులు సద్వినియోగం చేసుకున్నారు. జనహిత్ చారిటబుల్ ట్రస్ట్, పీఎంఎల్ ఫౌండేషన్ వారు సంయుక్త ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్‌లో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా బాలబాలికలు వేర్వేరుగా తాము నేర్చుకున్న విషయాలను ఎంతో చక్కగా ప్రదర్శించారు. తాము నేర్చుకున్న భాషా ప్రావిణ్యంతో ఉపన్యాసం ఇస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. నిష్ణాతులైన డ్యాన్సర్ల మాదిరిగా నృత్యం చేస్తూ శభాష్ అనిపించుకున్నారు. తమ తండ్రి గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ స్థాపించిన జనహిత్ ట్రస్ట్ సేవాకార్యక్రమల్లో భాగంగా చిన్నారుల కోసం ఈ వేసవి క్యాంపు నిర్వహించామని, సంవత్సరం పొడవునా సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని బీజేపీ నాయకులు దేవర వంశీ తెలిపారు.

మేరు కులస్తులకు తగిన ప్రాధాన్యమివ్వాలి


బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా ప్రతిపాదికన మేరు కులస్తులకు సీట్లు కేటాయించి తగిన ప్రాధాన్యమివ్వాలని తెలంగాణ రాష్ట్ర మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకులాభరణం కృష్ణమోహన్‌రావుకు పోల్కం శ్రీనివాస్ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనాభా ప్రాతిపాదికన మేరు కులస్తులకు అధిక శాతం సీట్లు ఇవ్వాలని దాని కోసం శ్వేత పత్రం విడుదల చేయాలన్నారు. డాక్టర్ కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. తన తరఫున న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

యక్షగాన కళాకారుల అభ్యున్నతికి కృషి


నూతన కార్యవర్గ సభ్యులతో గణపతి తదితరులు

గన్‌ఫౌండ్రీ: ప్రస్తుత సమాజంలో అంతరించిపోతున్న చిందు యక్షగాన కళాకారుల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని చిందు హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు గజవెల్లి గణపతి అన్నారు. ఈ మేరకు సోమవారం చిందు హక్కుల పోరాట సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా గడ్డం స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గడ్డం సమ్మయ్య, ప్రధాన కార్యదర్శిగా పిల్లుట్ల రమేష్ ఎన్నికయ్యారు. తనమీద నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు గడ్డం స్వామి అన్నారు. చిందు యక్షగాన కళాకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఘనంగా మహారాణా ప్రతాప్ జయంతి


వేడుకల్లో నందకిశోర్ వ్యాస్ బిలాల్, జితేందర్ సింగ్ డాక్టర్ భగవంతరావు

అబిడ్స్: బేగంబజార్ భూలక్ష్మీమాత చౌరస్తా వద్ద 483వ శ్రీ వీర్ శిరోమణి మహారాణా ప్రతాప్ జయంతి వేడుకలు సోమవారం పెద్ద ఎత్తున చేపట్టారు. ఠాకూర్ సురేందర్ సింగ్ ఆధ్వర్యంలో ఈ వేడకలు చేశారు. గోషామహల్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, రిలయన్స్ హైటెక్ స్కూల్ విద్యా సంస్థల చైర్మన్ జితేందర్ సింగ్, గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంతరావు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిర్వాహకులు సురేందర్ సింగ్ ముఖ్యఅతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పరమేశ్వరీ సింగ్, శౌరాజ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.